ప్రజాశక్తి

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024 5 విజయనగరం




3న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఇంటెల్ సర్వ్ ఐటి సొల్యూషన్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్-06,ఫైనాన్షియల్ కల్సల్టెంట్-50, ఇంటెల్ సర్వ్‌లో ఫీల్డ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీసు వర్క్- 25 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా పోస్టులను బట్టి ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సిఎస్.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని, ఈనెల 3న ఉదయం 10 గంటలకు విజయనగరం బిసి కాలనీ సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలో జరిగే ఇంటర్వ్యూకి హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 8919378915 నంబరుకు సంప్రదించాలని అరుణ సూచించారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అలైన్‌మెంట్ మార్పు చేయకపోతే ఆ ప్రాజెక్టుల వల్ల భూ నిర్వాసిత రైతులకు నష్టం జరగడంతోపాటు ప్రభుత్వానికి కూడా వ్యయ భారం పెరగనుంది. కాలువ మార్కింగ్ ఎగువ ప్రాంతం నుంచి కాకుండా లోతట్టు ప్రాంతం నుంచి చేసేందుకు నిర్ణయించడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో కాలువ డిజైనింగ్ మార్పు చేయాలంటూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన నిర్వాసిత రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి కాలువల నిర్మాణం చేపట్టడం ద్వారా లక్ష్యిత సాగునీరు, తాగునీటికి ఇబ్బందేమీ ఉండబోదని సాంకేతిక నిపుణులు సైతం చెబుతున్నారు. అయినా ప్రభుత్వానికి పట్టకపోవడంతో రైతుసంఘం ఆధ్వర్యాన ప్రభుత్వంపై పోరాటానికి రైతాంగం సన్నద్ధమౌతోంది.



నేడు నిర్వాసిత రైతులతో సదస్సు

గంట్యాడ మండలం తాటిపూడిలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ నిర్వాసిత పోరాట కమిటీ (ఎపి రైతు సంఘం) ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 10గంటలకు సదస్సు జరుగనుంది. ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ హాజరు కానున్నారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, కోళ్ల లలితకుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులను ఈ సదస్సుకు ఆహ్వానించినట్లు పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ తెలిపారు. 58 గ్రామాల నుంచి రైతులు హాజరవుతారని తెలిపారు.

సుజల స్రవంతి అలైన్‌మెంట్ మార్చకపోతే

నష్టమే ఎక్కువ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

- లోతట్టు ప్రాంతం నుంచి లైన్‌మార్క్
- నీటి వసతికి పరిమిత అవకాశాలు
- భారీగా భూములు కోల్పోనున్న రైతులు
- ఖర్చు తగ్గించుకునేందుకు అవకాశమున్నా పట్టని ప్రభుత్వం
- నేడు ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన సదస్సు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను సస్యమలం చేస్తామంటూ 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7,214.10కోట్ల వ్యయంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 8లక్షల ఎకరాలకు సాగునీరు, 2.30లక్షల జనాభాకు రోజుకు 4.46టిఎంసిల తాగునీటితోపాటు మొత్తం సాగునీటిలో 1శాతం నీటిని పారిశ్రామిక అవసరాలకు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందులో అత్యధికంగా సుమారు 3.94లక్షల ఎకరాల మేర ఉమ్మడి విజయనగరం జిల్లాకు రావాల్సివుంటుంది. ఇందులో భాగంగా ఈ జిల్లాలో ప్రభుత్వం తలపెట్టిన కాలువల అలైన్‌మెంట్ వల్ల ఇప్పటికే సాగునీటి సదుపాయం ఉన్న సారవంతమైన భూములు ఎక్కువ మంది కోల్పోనున్నారు. ఇదే కాస్త ఎగువ ప్రాంతంలో తూర్పు కనుమలకు ఆనుకుని కాలువల లైనింగ్ రూపొందిస్తే రైతుల నుంచి సేకరించాల్సిన భూమి తగ్గుతుంది. లిఫ్ట్‌ల సంఖ్య 6నుంచి 4కు తగ్గడంతోపాటు, వాటి నిర్వహణ అయ్యే ఖర్చు కూడా తగ్గుతుందని సాగునీటి రంగానికి చెందిన సీనియర్ ఇంజినీరింగ్ నిపుణులు ఐఎస్ఎన్ రాజు తదితరుల చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కాలువ అలైన్‌మెంట్ మార్పుచేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు చాలా కాలంగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతునే ఉన్నారు. ఈ విషయమై సాగునీటి పారుదలశాఖ అధికారులు, ఆశాఖకు చెందిన రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబులతో ఎపి రైతు సంఘం నాయకత్వంలో రైతులు పలుమార్లు రాయబారం నడిపినా వారు పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో రైతులు తమ పోరాటం తీవ్రతరం చేసేందుకు సన్నద్ధమౌతున్నారు.

ఇదీ అసలు సమస్య

ప్రస్తుతం ప్రభుత్వం చేసిన అలైన్‌మెంట్ మార్కింగ్ తాటిపూడి నుంచి గజపతినగరం, గుర్ల మండలాల మీదుగా సాగుతుంది. దీనికి పైన ఉన్న మెంటాడ, దత్తిరాజేరు, రామభద్రపురం, తెర్లాం, మెరకముడిదాం, బాడంగి, బలిజిపేట, బొబ్బిలి, రాజాం తదితర మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపాల్సి వస్తుంది. అదే మెంటాడ, రామభద్రపురం, బొబ్బిలి, బలిజిపేట మీదుగా అలైన్‌మెంట్ మార్పుచేస్తే ఆంధ్రజలాశయం, చంపావతి, వేగావతి, ఏడొంపులగెడ్డ, పోతులగెడ్డ తదితర నదులు, గెడ్డలను అనుసంధానం చేయవచ్చు. తద్వారా నిర్ధేశిత ఆయుకట్టు పూర్తిస్థాయిలో నీరందించవచ్చు. ఆయుకట్టు ప్రాంతంలో 90శాతం భూమి దిగు భాగాన ఉండడం వల్ల లిఫ్ట్‌ల సంఖ్య, కాలువల నిర్మాణాకి ఖర్చు తగ్గుతుందని రైతులు, ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెలించాలని పట్టు

సుజల స్రవంతి కాలువ కోసం ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం 8మండలాల్లో 4,400 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. కాలువల అలైన్‌మెంట్ మార్పు చేయడంతోపాటు ఇందుకోసం సేకరిస్తున్న భూమికి ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేస్తోంది.

స్వలాభం కోసం మంకుపట్టు

ప్రభుత్వ పెద్దలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమే కాలువ అలైన్‌మెంట్ మార్పు విషయంలో ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఖర్చు తగ్గితే వారికి కమీషన్లు తగ్గిపోతాయని భావిస్తున్నారేమో. దీనివల్ల ప్రభుత్వ వ్యయం భారీగా పెరగడంతోపాటు నిర్వహణ కూడా కష్టతరంగా మారుతోంది. అలైన్‌మెంట్ మార్పువల్ల ఆయుకట్టు లక్ష్యానికి ఢోకాలేదని నిపుణులు చెబుతున్నా వినిపించుకోవడం లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిపుణుల కమిటీవేసి అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి మేలు చేకూర్చాలి.

బుద్ధరాజు రాంబాబు
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి



కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

బకాయిలు చెల్లించాల్సిందే : యుటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు 7వేల కోట్ల తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు రెండో రోజు గురువారం కూడా కొనసాగాయి. దీక్షలను ఉద్దేశించి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్ చంద్ర పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం మనం దాచుకున్న డబ్బులు దోచుకుంటోందని అన్నారు. అవసరాల కోసం మనం పొదుపు చేసుకున్న డబ్బులను మనకు ఇవ్వకుండా తీసుకొనే హక్కు ఈ ప్రభుత్వానికి లేదని అన్నారు. మెగా డిఎస్‌సి అని చెప్పి 6100 పోస్టులు మాత్రమే ఖాళీలు చూపించడం దారుణమని, వేల పోస్టులు ఖాళీగా వున్న ప్పటికీ కుదించి చూపడం నిరుద్యోగులకు అన్యాయం చెయ్యడమే అని అన్నారు. వెట్టిచాకిరి చేసే అప్రెంటీస్ విధానాన్ని అనేక పోరాటాలు చేసి రద్దు చేయించుకుంటే తిరిగి ఆ విధానాన్ని ప్రవేశపెట్టడం దారుణమని అన్నారు. భవిష్యత్‌లో దీనిపై పెద్దఎత్తున పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు వి.ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శులు పతివాడ త్రినాథ్, కె.ప్రసాద రావు, పి.రామి నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.నిర్మల, మండల నాయకులు ఎస్‌విరమణ, బి.ముకుంద రావు, కె.చంద్ర మోహన్, అప్పారావ పాల్గొన్నారు.

గిరిజనులతో ట్రైనీ కలెక్టర్ ముఖాముఖి

ప్రజాశక్తి-గంట్యాడ

ఐఎఎస్ శిక్షణలో భాగంగా జిల్లాలో శిక్షణ పొందుతున్న బిఎస్ వెంకట త్రివినాగ్ గురువారం తాటిపూడి జలాశయం వద్ద గ్రామంలో గిరిజనులను కలుసుకున్నారు. వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి జీవన విధానాలను, జీవనోపాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

సదస్సు జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట/వేపాడ

గంట్యాడ మండలంలోని తాటిపూడిలో శుక్రవారం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (పోలవరం ఎడమ కాలువ) భూ నిర్వాసిత పోరాట కమిటీ (ఎపి రైతు సంఘం) ఆధ్వర్యాన నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని పలు గ్రామాల్లో రైతు సంఘం నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు.వేపాడ మండలంలోని ఆతవ, వీరనారాయణం, వికెఆర్ పురం ఎస్.కోట మండలంలోని శివరామరాజుపేటలో గ్రామాల్లో పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు, సహాయ కార్యదర్శి మద్దిల రమణ ప్రచారం చేపట్టారు. రైతులను కలిసి సదస్సుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కొత్తవలస మండలం నుండి గుర్ల మండలం గడిగెడ్డ వరకు సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి భూ సేకరణ చేస్తున్నారని, కెనాల్ అలైన్మెంట్ ను రైతులకు తక్కువ నష్టం ఉండేలా మార్పు చేయాలని, 2013 చట్ట ప్రకారం భూ సేకరణ చేయాలని రెండు ప్రధానమైన డిమాండ్లను రైతులు పెట్టినప్పటికీ ప్రభుత్వం గ్రామ సభలలో మెజారిటీ అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకోలేదని చెప్పారు. అప్పటి నుండి బాధిత రైతులతో పోరాటాలు చేస్తూనే ఉన్నామని తెలిపారు. అందులో భాగంగా తాటిపూడి శివాలయం వద్ద ఉదయం 10గంటలకు నిర్వహించనున్న సదస్సుకు రైతులంతా తరలి రావాలని కోరారు.



రహదారిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

నగర అభివృద్ధికి కృషి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఇప్పటికే లక్షలాది రూపాయలతో నగరాన్ని సుందరీకరణ చేశామన్నారు. రామారాయుడు రహదారిలో నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాణిజ్య సంఘం ప్రతినిధులు కేదారశెట్టి సీతారామమూర్తి, కాపుగంటి ప్రకాష్ మాట్లాడుతూ నగరానికి ప్రధాన వ్యాపార కూడలిగా ఉన్న రామారాయుడు రోడ్డు గతకలమయంతో ఉండేదని అన్నారు. డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లడంతో కోటి రూపాయలతో రహదారి సౌకర్యాన్ని కల్పించారన్నారు. త్వరలోనే మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ సెంటర్లో ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చులయా యాదవ్, వైసీపీ నాయకులు యడ్ల రాజేష్, బలివాడ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ సహాయ కమిషనర్‌గా సిహెచ్. తిరుమలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు నుండి బదిలీపై వచ్చిన ఆయన విధులకు హాజరయ్యేముందు పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కార్యాలయానికి చేరుకుని బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాభివృద్ధికి తను వంతు కషి చేస్తానని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయరు విజయలక్ష్మి, కౌన్సిల్ సభ్యుల సూచనలు సలహాలతో నగరాభివద్ధికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నగరపాలక సంస్థ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

రెండో రోజూ ఆడుదాం ఆంధ్ర పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రీడల్లో భాగంగా గురువారం రెండో రోజు వాలీబాల్, కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన విజేతలైన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. లీగ్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్లుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన జట్లుకు బహుమతి ప్రదానం చేయనున్నారు. రెండోరోజు పోటీలను డిఎస్‌డిఒ, సెట్విజ్ సిఇఒ రామ్ గోపాల్ ప్రారంబించారు. క్రీడాకారులందరికీ భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు.

రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో దళిత గిరిజనులకు అమలులో ఉన్న ప్రత్యేక పథకాలు రద్దు చేయడం దారుణమని ప్రభుత్వం వెంటనే వాటిని పునరుద్ధరించాలని ' స్కాలర్ వాయిస్ ' రాష్ట్ర అధ్యక్షులు కొణిదెల. విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బహుజన గళం కార్యాలయంలో జిల్లా దళిత సంఘాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాల వెలుగులో ఎస్‌సి, ఎస్‌టిల సామాజిక ఆర్థిక, రాజకీయ రంగాలలో పురోభివద్ధి, సాధికారతను సాధించే దిశగా ప్రత్యేకంగా రూపొందించిన పథకాలను నేటి ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు .బహుజన రక్షణ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు కొక్కిరిగడ్డ. శ్యామ్ మాట్లాడుతూ గతంలో ఉన్న సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్దరింఆచలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిస.రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీలకు సంబంధించిన 32 సంక్షేమ అభివద్ధి పథకాలు రద్దు చేయడం వలన ప్రజలు చాలా నష్టపోతున్నారని అన్నారు. వీటి పునరుద్ధరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర న్యాయ సలహాదారుడు అంబేద్కర్ అశోక్, అంబేద్కర్ రైట్స్ అధ్యక్ష కార్యదర్శులు పాండ్రంకి. వెంకటరమణ, గంటా వీర్రాజు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు నష్టం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి పాలనలో ప్రజలు అన్ని విధాలా నష్టపోయారని టిడిపి నియోజక ఇన్‌ఛార్జి అదితి గజపతి అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం 24వ , 25వ డివిజన్‌లలో బూర్లెపేట, తారక రామకాలనీ, పిళ్ళా వారి వీధి, బెవర వీధి, రంగాల వీధి, మంగళి వీధి, బేతాళ వీధి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న అదితి గజపతి

ఇద్దరు డిఎస్‌పిలు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా జిల్లాలోని ఇద్దరు డిఎస్‌పిలను బదిలీ చేస్తూ డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం దిశ పోలీసుస్టేషన్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావును శ్రీకాకుళం దిశ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయగా, బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీధర్‌ను అన్నమయ్య జిల్లాలో ఎసిబికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

డివిజికి పలువురు పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు మాతృమూర్తి మంగమ్మ ఇటీవలే మృతి చెందిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు గురువారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంకి వచ్చి పరామర్శించారు. అరకు పార్లమెంట్ వైసిపి అధ్యక్షుడు పరిక్షిత్ రాజు, ప్రజాప్రతినిధుల, తదితరులు మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

20 మంది ఎంపిడిఒలకు మండలాలు కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరం

ఇటీవల బదిలీ అయిన ఎంపిడిఒల స్థానంలో ఉమ్మడి జిల్లాలోని 20 మండలాలకు ఎంపిడిఒలను కేటాయిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వాటిలో మన్యం జిల్లాలో నాలుగు మడలాలకు, విజయనగంర జిల్లాలో 16 మండలాలకు శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకు చెందిన ఎంపిడిఒలను బదిలీ చేశారు. వారిలో కొందరు గురువారం బాధ్యతలు చేపట్టారు.

మెరకముడిదాం	ఎం.పావని
దత్తిరాజేరు	పి.చంద్రకుమారి
తెర్లాం	బి.మధుసూదనరావు
రామభద్రపురం	సిహెచ్ ఈశ్వరమ్మ
గుర్ల	బి.వెంకటరమణ
జామి	వి.తిరుమలరావు
బొండపల్లి	ఎస్.హరిహరరావు
గరివిడి	కె.నిత్యల
కొత్తవలస	ఎస్.రమణయ్య
వేపాడ	హెచ్ శశిభూష్ణణరావు
చీపురుపల్లి	డి.శ్వేత
గజపతినగరం	పి.జయంత్‌ప్రసాద్
మెంటాడ	సిహెచ్ లక్ష్మీభాయ్
డెంకాడ	ఎ.లవరాజు
ఎస్.కోట	ఎ.సాంబశివరావు
భోగాపురం	జి.చంద్రకళ
సాలూరు	కె.ఫణీంద్రకుమార్
బలిజిపేట	ఎన్.రమేష్‌నాయుడు
గరుగుబిల్లి	పి.సూర్యనారాయణ
గుమ్మలక్ష్మీపురం	ఎం.ఈశ్వరరావు



వైద్యాధికారికి వినతినిస్తున్న ఆశావర్కర్లు

8న ఆశాల చలో విజయవాడ

అర్బన్ హెల్త్ సెంటర్ల అధికారులకు ఆశా వర్కర్ల వినతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న చలో విజయవాడ వెళ్తున్నామని విజయనగరం అర్బన్ ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మహాలక్ష్మి, నాయకులు, రాజేశ్వరి, అప్పయ్యమ్మ , పద్మ తెలిపారు. గురువారం నగరంలోని కెఎల్‌పురం, లంకా పట్నం, ధర్మపురి అర్బన్ హెల్త్ సెంటర్స్ మెడికల్ ఆఫీసర్లకు ఈనెల 8న విధులకు హాజరుకాలేమని తెలియజేస్తూ వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్‌లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం, ఖాళీల భర్తీ, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు, స్టాఫ్ నర్స్ నియామకాల్లో ఆశాలకు వెయిటేజీ తదితర సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

చింతలపాలెంలో కుష్టు వ్యాధిపై ర్యాలీ

ప్రజాశక్తి- కొత్తవలస



ర్యాలీ చేస్తున్న సర్పంచ్, సిబ్బంది

మండలంలోని చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారామ పాత్రుడు ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా కొత్తవలస పిహెచ్‌సి సిబ్బంది, ఎంపియుపి స్కూల్ విద్యార్థులు చింతలపాలెం గ్రామంలో తిరిగి కుష్టి వ్యాధి నివారణ కోసం అవగాహన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. చేతులు కలుపుదాం కుష్టి వ్యాధిని నిర్మూలిద్దాం అని నినాదాలు చెబుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మజ్జి కనకేశ్వరావు, నవీన్, ఎం రాము, ఎస్ నానాజీ, ఎం ప్రసాద్, లింగాలు, పళ్ళ రామయ్య, ఎస్ రమణ, యు పైడ్రాజు, రమణ, సిహెచ్. విజయలక్ష్మి, ఎఎన్ఎం సుగుణ, ఆశ రత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

బొబ్బిలి: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కొరతతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని యువత, విద్యార్థులను కోరారు. 31మంది రక్తదానం చేశారు. విజయనగరం రెడ్ క్రాస్ రక్తనిధి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వైద్యులు జె.శశిభూషణరావు, రాంనరేశ్, కృష్ణ కుమార్, రవిశంకర్, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


చీపురుపల్లి: మండలంలోని పెదనడిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష గురువారం శంకుస్థాపన చేశారు. పెదనడిపల్లి పంచాయతీలోని ఎస్‌సి కాలనీకి సంబంధించి రూ.2లక్షలు ఎంపిపి నిధులతో సిసి రోడ్డు పనులకు, మరో రూ. 2లక్షలు జెడ్‌పిటిసి నిధులతో రచ్చబండ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఎంపి నిధుల నుండి రూ.5లక్షలతో జిల్లా పరిషత్ పాఠశాలకు సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఇంఛార్జ్ చైర్‌పర్సన్ ఇప్పిలి శ్రీనివాసరావు, సర్పంచ్ పోలరాజు, ఎంపిటిసి రేగాన ఆదినారాయణ, వెంకన్న, నాన్నాల, అబ్బు, వార్డ్ మెంబెర్స్, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల వెనుక అధికార పార్టీ నాయకులు

బొబ్బిలి: ఇందిరమ్మ కాలనీల్లోని ఆక్రమణల వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆరోపించారు. దౌర్జన్యంగా ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను పక్కనపెట్టి ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నారన్నారు. ఆయన తమ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ సెంటున్నర స్థలంలో డూప్లెక్స్ ఇల్లు నిర్మాణాలు ఎలా సాధ్యమన్నారు. మున్సిపల్ చైర్మన్‌కు డబ్బులు చెల్లించి నిర్మాణాలు చేపడుతున్నామని పబ్లిక్‌గా చెబుతున్నారని చెప్పారు. అక్రమ కట్టడాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెడ్డిక సాధికార సమితి కన్వీనర్‌కు సన్మానం

ప్రజాశక్తి- భోగాపురం



అప్పలరామిరెడ్డిని సత్కరిస్తున్న కర్రోతు బంగార్రాజు

మండలంలోని చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం గ్రామానికి చెందిన నీలాపు అప్పల రామిరెడ్డిని పార్లమెంట్ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్‌గా ఇటీవలి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చం నాయుడు నియమించారు. ఈ సందర్భంగా అప్పలరామిరెడ్డిని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనా రాయణ పోలిపల్లి గ్రామంలో గురువారం అతన్ని ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అప్పల రామిరెడ్డి అన్నారు.

పలు పాఠశాలలు పరిశీలన

వేపాడ: మండలంలో పెదగుడిపాల ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సోంపురం పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు గురువారం పరిశీలించారు. పరిశీలనలో భాగంగా ఎన్నికల్లో పోలింగ్‌కు కల్పించాల్సిన సౌకర్యాలు, విద్యార్థుల వర్క్ బుక్స్‌ను తనిఖీ చేశారు. నాడు నేడు నిధులతో నిర్మించి మరుగు దొడ్లను, ఎండిఎంలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివిఎ రాజు, సిఆర్‌పి కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యోగులకు ఒకటికి వేతనాలివ్వాలి

బొబ్బిలి: విద్యుత్తు ఉద్యోగులకు ప్రతినెల ఒకటికి వేతనాలు చెల్లించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతినెలా ఒకటికి వేతనాలు ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్థానిక నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బమ్మిడి రాముకు అభినందనలు

నెల్లిమర్ల: మన టిడిపి యాప్‌లో 2.50లక్షల పాయింట్లు దాటినందుకు బమ్మిడి రాముని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అభినందించారు. గురువారం అలుగోలుకు చెందిన రాము నియోజక వర్గంలో ప్రథమ ర్యాంక్ సాధించిన సందర్భంగా రాష్ట్ర పార్టీ నుంచి వచ్చిన బహుమతి సైకిల్ ఐటిడిపి పార్లమెంటు అధ్యక్షులు విమలారాణి ఆధ్వర్యంలో ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు చేతుల మీదుగా అందజేశారు. కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ బమ్మిడి రాము నిరంతరం పార్టీకి నిస్వార్థంగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా ప్రచారం చేస్తూ నియోజకవర్గంలో ప్రథమ స్థానం రావటం అభినందనీయమన్నారు. రాముని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పార్టీకి కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భోగాపురం టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, నీలపు అప్పలరామిరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

తెర్లాం: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను ఎంఇఒ త్రినాధరావు గురువారం పరిశీలించారు. మండలంలో ఎన్నికల నిర్వహణ నిమిత్తం గుర్తించిన 62 పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్స్, ట్యూబ్ లైట్లు, ర్యాంప్, నీటి సదుపాయం, మరుగుదొడ్ల సౌకర్యం, తలుపులు కిటికీలు వంటి సౌకర్యాలు పరిశీలించారు. సౌకర్యాలు లేని చోట పాఠశాల నిర్వహణకు కేటాయించిన నిధులను సౌకర్యాలు నిమిత్తం వినియోగించాలని సూచించారు.

కంటి శస్త్ర చికిత్సలకు 53మంది ఎంపిక

భోగాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో పోలిపల్లి పీహెచ్‌సి పరిధిలో కంటి ఆపరేషన్స్ కోసం రిఫరల్స్‌గా గుర్తించిన వారికి జిల్లా అంధత్వ నివారణ సంఘం సహకారంతో శస్త్ర చికిత్సల నిమిత్తం గురువారం తనిఖీలు నిర్వహించారు. భోగాపురం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భోగాపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సా శిబిరంలో సుమారు 110 మందిని పరీక్షించారు. ఇందులో 53 మందిని ఆపరేషన్ల కోసం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించనున్నారు. పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరుపతి స్వామి, మోపాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అఫ్తాల్మిక్ అధికారి మజ్జి గణపతి రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది అలేఖ్య, సాయికుమార్, స్థానిక సాయి సేవా సమితి కన్వీనర్ కృష్ణారావు, సభ్యులు, ఆరోగ్య సిబ్బంది ప్రభాకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రామభద్రపురం: వరుస దాడులతో అక్రమార్కులకు ముచ్చెమటలు పట్టిస్తున్న ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తాజాగా బుధవారం అర్ధరాత్రి ఇట్లా మామిడిపల్లి శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి సుమారు రూ.53 వేలు స్వాధీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వివిధ గ్రామాలకు చెందిన వారు నిత్యం జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలుపై నిఘా ఉంటుందని ఇలా పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

బకాయి డిఎలు వెంటనే చెల్లించాలి

● సస్పెండ్, బదిలీ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలి ●మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - నెల్లిమర్ల



నిరవధిక ధర్నాలో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న టివి రమణ

మిమ్స్ యాజమాన్యం సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బకాయి ఏడు డిఎలను ఇవ్వాలని మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని, అన్యాయంగా సస్పెండ్ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నిరవధిక ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరితే మిమ్స్ యాజమాన్యం సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోని బకాయి ఉన్న 7 డిఎలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కక్ష సాధింపు, వేధింపులు ఆపి, బదిలీ చేసిన ఉద్యోగులను మిమ్స్‌లోని డ్యూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసి వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారించే వరకు నిరవధిక ధర్నా కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మిమ్స్ ఉద్యోగులు ఎం.నారాయణరావు, వి. అప్పల నాయుడు, కె. కాము నాయుడు, టి. రామకృష్ణ, ఎం.నాగ భూషణం, కె. నాగేశ్వర రావు, జి. వరలక్ష్మీ, వి.భవాని, బి. బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న బేబినాయన

విజ్ఞాన కేంద్రానికి ఐరన్ వితరణ

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయనగరంలో నిర్మిస్తున్న శేషగిరి విజ్ఞాన కేంద్రం భవనం నిర్మాణానికి అవసరమైన ఐరన్‌ను టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన వితరణ చేశారు. ఈ విజ్ఞాన కేంద్రానికి అవసరమయ్యే ఐరన్ కొనుగోలు కోసం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, ఇతర నాయకులకు బేబినాయన నగదు అందజేశారు. యుటిఎఫ్ డివిజన్ కమిటీ తరుపున బేబినాయనకు కృతజ్ఞతలు చెప్పారు.

గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటన

ప్రజాశక్తి- శృంగవరపుకోట



పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

మండలంలోని దారపర్తి గ్రామ పంచాయతీ గిరిశిఖర గ్రామాలైన పల్లపుదుంగాడ, పొర్లు గ్రామాల్లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని గిరిజనులను కలిసి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుని, వారికి అందుతున్న పథకాలు గురించి ఆరా తీశారు. విద్యుత్ సౌకర్యం మెరుగు పర్చాలని, పల్లపుదుంగాడ నుండి పొర్లుకు (వయా దారపర్తి) రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని తాగునీటి సౌకర్యం, ఇంటింటి కుళాయి, ఫౌరసరఫరాలు, పోడు పట్టాలు, మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీను ప్రజలు కోరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ దబ్బగుంట గ్రామం వద్ద నుండి పల్లపుదుంగాడ వరకు ప్రభుత్వం మంజూరు చేసిన బి.టి రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇప్పటికే పలుచోట్ల బ్రిడ్జిలు, కాజ్‌వేలు నిర్మాణంలో ఉన్నాయని, మిగిలిన పని త్వరితగతిన పూర్తయ్యేట్లు చూస్తామని హామీ ఇచ్చారు. పల్లపుదుంగాడ నుండి పొర్లుకు (వయా దారపర్తి) గతంలో ఉన్న గ్రావెల్ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి అవసరమైన అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి, పనులను చేపట్టి త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ తదితర విషయాలపై త్వరలో జిల్లా కలక్టరుతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పల్లపుదుంగాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ సన్యాసిరావు, వైస్ సర్పంచ్ రాజేశ్వరి, మాజీ సర్పంచులు ఎర్రయ్య, బుచ్చయ్య, రామన్న, సీతమ్మ, నాయకులు మురళీరాజు, మూల బొడ్డవర పంచాయితీ మాజీ సర్పంచ్ కరగాని సత్యనారాయణ, మాజీ వైస్ సర్పంచులు శ్రీరాములు పాల్గొన్నారు.

వైసిపిని ఓడించేందుకు జనం సిద్ధం

ప్రజాశక్తి- శృంగవరపుకోట



గ్రామాల్లో పర్యటిస్తున్న గొంప కృష్ణ, తదితరులు

వైసిపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆరోపించారు. గురువారం మూడవరోజు ఆయన ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న బొడ్డవరం, రాజిపేట, ధర్మవరం, మామిడిపల్లి, వేములపల్లి, అలుగుబిల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో గొంప కృష్ణ మాట్లాడుతూ జగన్మోహన రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైందని ఇక మిగిలింది 72 రోజులు మాత్రమేనని అన్నారు. ఎన్నికలు వస్తున్నందున జగన్ రెడ్డి 'సిద్ధం'తో బహిరంగ సభలు నిర్వహించి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఒకవైపు ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని జగన్మోహన్ రెడ్డి, వైసిపి నేతలు చెబుతుంటే, మరోవైపు ప్రజలు కూడా వారిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు రూ.200 ఉన్న విద్యుత్ బిల్లులు ఇప్పుడు 5 రెట్లు పెరిగి రూ.1000కి చేరాయన్నారు. మద్యం, నిత్యావసర వస్తువుల ధరలు, ఆర్‌టిసి బస్సుల ఛార్జీలను పెంచుతూ ప్రజలను దోచుకుంటోందన్నారు. రాష్ట్రంలో మద్యాన్ని నిషేధిస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి 25 ఏళ్ల పాటు మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టి 36 వేల కోట్ల రూపాయలు అప్పు తీసుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఛాంపియన్‌గా ఎస్.కోట జట్టు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ మహిళల ఛాంపియన్‌గా ఎస్ కోట నియోజవర్గం నిలిచిందని ఎస్‌కోట మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం విజయనగరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలలో ఎస్ కోట నియోజవర్గానికి ప్రాతినిధ్యం వహించిన బి.హారిక, జె.శ్రీయాదేవిలు ఫైనల్స్‌లో సాలూరు నియోజకవర్గం జట్టుపై 2-0 స్కోర్ తేడాతో గెలుపొంది ఛాంపియన్లుగా నిలిచి రూ.35వేలు ప్రైజ్ మనీ సొంతం చేసుకున్నారని శ్రీరాములు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారినులను గురువారం ఉదయం ఎమ్మెల్సీ, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘు రాజు, జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిని, వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి క్రీడాకారుల అభినందించారు. ఈనెల 6వ తేదీ నుండి విశాఖపట్నంలో జరగబోవు రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జె. విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కొప్పల వెలమలకు ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

రాజకీయ పదవులలో కొప్పల వెలమలకు ప్రాధాన్యత ఇవ్వాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిలపర్తి పరదేశినాయుడు, జిల్లా అధ్యక్షులు బి.వరప్రసాద్ డిమాండ్ చేశారు. వెలమ కమ్యూనిటీ భవనంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొప్పల వెలమలు 25లక్షల మంది ఉన్నప్పటికీ రాజకీయ పదవులలో ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. జిల్లాలో అధిక శాతం మంది కొప్పల వెలమలు ఉన్నప్పటికీ అసెంబ్లీ సీట్లు ఇవ్వకుండా ఇతర కులాలకు ఇస్తున్నారని విమర్శించారు. విజయనగరం ఎంపి, గజపతినగరం, బొబ్బిలి కొప్పలవెలమలకు ఇవ్వాలని, పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలు రిజర్వేషన్ కావడంతో ఆయా స్థానాల్లో కొప్పలవెలమలకు ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొప్పల వెలమలకు ప్రాధాన్యత ఇస్తున్న పార్టీలకు తాము ఓట్లు వేసి గెలిపిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల కార్యదర్శి సాయికృష్ణ, అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సభ్యులు కొల్లి రామారావు, మరడ అప్పారావు, లక్ష్మయ్య, మేళాపు శ్రీహరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని సామాయవలస, పులిగుమ్మి గ్రామాలకు చెందిన 20 వైసిపి కుటుంబాలు గురువారం టిడిపిలో చేరాయి. వీరికి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచకాలపై ప్రజలు తిరుగుబాటు ప్రారంభించారన్నారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. మునుముందు మండలంలో మరిన్ని చేరికలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, మండల నాయకులు పాల్గొన్నారు.

సహారా సొమ్ము చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సహారాలో డబ్బులు కట్టిన ఖాతాదారులకు వారి సొమ్మును వారికి తిరిగి చెల్లించాలని సహారా బాధితులు, ఏజెంట్లు ఆంధ్రప్రదేశ్ సహారా స్టాఫ్ అండ్ ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సహారా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహారా ఖాతాదారులకు చెల్లింపులు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చెల్లింపులు పూర్తయ్యే వరకు పట్టణంలోని సహారా కార్యాలయం మూతపడకుండా చూడాలన్నారు. అనంతరం ఎస్ఐ గంగరాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సహారా ఇండియా ఖాతాదారులు, ఏజెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సహారా ఖాతాదారులకు చెల్లింపులు ప్రారంభించాలని సహారా ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు బిఎల్ దాసు, వైఎ నాయుడు డిమాండ్ చేశారు. సహారా ఖాతాదారులకు చెల్లింపులు ప్రారంభించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో గురువారం శాంతి ర్యాలీ చేసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహారాలో పేదలు దాచుకున్న డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా యాజమాన్యం మోసం చేసిందని ఆరోపించారు. డిపాజిట్ సొమ్ము చెల్లించాలని కోరుతూ పోరాటం చేస్తే కేంద్ర ప్రభుత్వం, సిఆర్‌సి, సహారా కలిసి పోర్టల్ పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎఎస్‌ఐ మానవత్వం

ప్రజాశక్తి - బొండపల్లి



ఫీజు కట్టిన రసీదును విద్యార్థికి అందిస్తున్న ఎఎస్‌ఐ గోపీనాథరావు

గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన గెద్ద మణికంఠ చదువులో భాగా రాణించేవాడు. తండ్రిని కోల్పోయిన మణికంఠ తల్లి నారాయణమ్మ సహకారంతో చదువుకోవాలని ఆశ ఉన్నప్పటికి పేదరికం అడ్డురావడంతో ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. ఈ పరిస్థితిని గమనించిన బొండపల్లి ఎఎస్‌ఐగా పనిచేస్తున్న అదే గ్రామానిక చెందిన లెంక గోపీనాథ రావు చదివించేందుకు ముందుకు వచ్చారు. విద్యకు అవసరమైన చేయూతను అందిస్తానని తల్లి నారాయణమ్మకు విద్యార్థి మణికంఠకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎఎస్‌ఐ గోపీనాథరావు గొట్లాం గాయత్రి కళాశాలలో మణికంఠను ఇంటర్‌లో చేర్పించారు. ఇందుకు సంబంధించి హాస్టల్ వసతికి, కళాశాల ఫీజుకు అయిన ఖర్చును భరించారు. ఈ మేరకు గురువారం కళాశాల యాజమాన్యానికి మొత్తం ఫీజును చెల్లించారు. దీంతో విద్యార్థి మణికంఠ సంతోషం వ్యక్తం చేశారు. కాగా పోలీస్ అంటే కర్కసత్వం, కాటిన్యం అనుకొనే వారికి చదువు కోసం గోపీనాద్ చూపిన మానవత్వం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని పలువురు కొనియాడుతున్నారు.

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ



చైర్మన్‌ను కలిసిన కమిషనర్ రామలక్ష్మి

చీపురపల్లి ఎంపిడిఒగా స్వేత

ప్రజాశక్తి -చీపురుపల్లి

చీపురుపల్లి నూతన ఎంపిడిఒగా డి.స్వేత గురువారం బాధ్యతలు చేపట్టారు. చీపురుపల్లి ఎంపిడిఒగా పని చేసిన జి గిరిబాల శ్రీకాకుళం జిల్లాకు బదిలీ పై వెల్లారు. ఆమె స్థానంలో శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం ఎంపిడిఒగా పనిచేసిన స్వేత చీపురుపల్లి వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఎంపిడిఒని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

రామభద్రపురం ఎంపిడిఒగా ఈశ్వరమ్మ

రామభద్రపురం: రామభద్రపురం నూతన ఎంపిడిఒగా ఈశ్వరమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం నుంచి బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన రమామణి వైజాగ్ జిల్లా చోడవరం బదిలీపై వెళ్లారు. ఈమెకు మండల పరిషత్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపిడిఒగా లవరాజు బాధ్యతలు స్వీకరణ

డెంకాడ: ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ డిడి స్వరూపారాణి ఇటీవల శ్రీకాకుళం బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఎంపిడిఒగా విశాఖపట్నం జిల్లా ఆనందపురం నుంచి ఎ. లవరాజు బదిలీపై ఇక్కడకు వచ్చి గురువారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఎంపిపి బంటుపల్లి వెంకట వాసు దేవరావును తన ఛాంబర్‌లో కలిశారు. ఈ సంద ర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. భాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం, ఎపిఎం విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రేగిడి తహశీల్దారుగా రాములమ్మ

రేగిడి: రేగిడి మండల తహశీల్దార్‌గా జె. రాములమ్మ బదిలీపై రానున్నట్లు తహశీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈమె గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై రేగిడి తహశీల్దారుగా రానున్నారు. ఇక్కడ తహశీల్దారుగా పనిచేసిన బి. సుదర్శన్‌రావు దత్తరాజేరు మండల తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. రాములమ్మ మరో రెండు రోజుల్లో తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టనున్నట్లు కార్యాలయ అధికారులు వెల్లడించారు.

డిఎస్‌పిగా శ్రీనివాసరావు

బొబ్బిలి: బొబ్బిలి డిఎస్‌పిగా పోతుల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ డిఎస్‌పిగా పని చేసిన పి.శ్రీధర్‌కు ఏసిబికు బదిలీ కావడంతో అనకాపల్లి డిటిసిలో పని చేస్తున్న శ్రీనివాసరావు బొబ్బిలి డిఎస్‌పిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రామలక్ష్మి

బొబ్బిలి: మున్సిపల్ కమిషనర్‌గా ఎల్.రామలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పని చేసిన ఎస్.శ్రీనివాసరావుకు జివిఎంసి డిప్యూటీ కమీషనర్‌గా బదిలీ కావడంతో జివిఎంసిలో పని చేస్తున్న రామలక్ష్మి కమిషనర్‌గా ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేస్తామని కమిషనర్ రామలక్ష్మి చెప్పారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి- చీపురుపల్లి

విద్యార్థులు మంచి భవిష్యత్తుకి బాటలు వేసుకోవాలని చీపురుపల్లి సర్కిల్ సిఐ ఉపేంద్ర రావు సూచించారు. గురువారం స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాలలో జరిగిన వార్షికోత్సవం కార్యక్రమంలో ఆర్‌డిఒ బి శాంతితో కలసి సిఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లను అలవరుచుకొని ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. రానున్న పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. గాయత్రీ కళాశాలలో చదువుకొని ఎస్‌ఐగా ఎంపికైన సిహెచ్ లలితాధిత్యను, డిసిసిబి మేనేజర్‌గా ఎంపికైన జి భారతిని ఈ సందర్భంగా వారు సన్మానించారు. జాతీయ స్థాయిలో కళాశాల తరుపున పలు క్రీడల్లో పాల్గొన్న గాయత్రీ కళాశాలకు చెందిన క్రీడాకారులను వారు అభినందించారు. కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లలితాధిత్యను సత్కరిస్తున్న సిఐ ఉపేంద్రరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

టిడిపితోనే బిసిల అభివృద్ధి : కోళ్ల

ప్రజాశక్తి - కొత్తవలస

రాష్ట్రంలో టిడిపితోనే బిసిల అభివృద్ధి జరిగిందని ఈ నేపథ్యంలో బిసిలంతా ఏకమై ఈ సారి చంద్రబాబును గెలిపించుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద గురువారం టిడిపి క్లస్టర్ ఇంఛార్జ్ పొట్నూరు వెంకట రత్నాజీ సారథ్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీసీలను అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపించిన ఏకైక పార్టీ టిడిపి మాత్రమేనన్నారు. బీసీలకు వెన్నుదన్నుగా చంద్రబాబునాయుడు ఉంటారని, వారి నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఆదరణ పథకాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు, సబ్ ప్లాన్ నిధులు, విదేశీ విద్య, స్కిల్ డెవలప్మెంట్, నామినేటెడ్ పదవులు వంటి అన్ని అవకాశాలు దొక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాశర్ల ప్రసాద్, తమ్మిన విజయ్ కుమార్, బొబ్బిలి అప్పారావు మాస్టర్, తిక్కాన చినదేముడు, కోళ్ల వెంకటరమణ (శ్రీను), బంగారు రమేష్, చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారామపాత్రుడు, కనకాల శివ, ఎల్లపు సూరిబాబు, నక్కరాజు చినరాము, కొరుపోలు అప్పారావు, లాలం అర్జునరావు, లెంక శ్రీను, గొంప దుర్గా ఉమేష్ తదితరులు పాల్గొన్నారు..